క్లుప్తంగా

ఉత్తములుగా తీర్చిదిద్దాలి

ఎంఈఓ చంద్రప్ప



పాఠం చదివిస్తున్న చంద్రప్ప

బంట్వారం: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ చంద్రప్ప సూచించారు. బుధవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని బార్వాద్ తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి పాఠాలు చదివించారు. రోజు బడికి వెళ్లి బాగా చదువుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్త భవనంలో కూర్చున్న విద్యార్థులను ఎంఈఓ మరో గదిలో కూర్చోబెట్టారు. హెచ్‌ఎం శ్రీనివాస్‌కు పలు సూచనలు చేశారు. ఎంఈఓ వెంట సీఆర్‌పీ నర్సింలు ఉన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



పరీక్ష చేస్తున్న డాక్టర్ భాస్కర్

బషీరాబాద్: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఎంపీపీఎస్ కొర్విచెడ్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తాండూరు పట్టణానికి చెందిన డాక్టర్ భాస్కర్ 63 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నలుగురిని జిల్లా ఆసుపత్రికి కంటి పరీక్షల కోసం రెఫర్ చేశారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ బిల్లలు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాను చైతన్య, ప్రధానోపాధ్యాయుడు నర్సింహరెడ్డి, ఉపాధ్యాయులు జగదీశ్, సుభాష్, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ ఆయా తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో మండల నాయకులు



పెళ్లి వేడుకలో సీఎంతో కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్వర్‌రెడ్డి కూతురు రుత్వికరెడ్డి పెళ్లికి బుధవారం మండలం నుంచి కాంగ్రెస్ నేతలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వధూవరులను అక్షితలు చల్లి ఆశీర్వదించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డిలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, ముఖ్య నాయకులు జయకృష్ణ, మల్లేశ్, అనీఫ్, రాంచంద్రారెడ్డి, రాములు, కిష్టప్ప, నర్సింలు నాయుడు, దేశ్యానాయక్, అంజిల్‌రెడ్డి, తోలు వెంకటయ్య, బాల్‌రాజ్‌గౌడ్, చంద్రప్ప, గుండప్ప, రేగడిమైలారం, బురాన్‌పూర్ తదితర గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి శోభాయాత్ర



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

తాండూరు: అయ్యప్పస్వామి దేవాలయ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం దేవాలయంలో స్వామి వారి విగ్రహానికి నిర్వాహకులు పూజలు నిర్వహించారు. 10గంటల నుంచి భక్తులు దేవాలయం నుంచి స్వామి వారి ఉత్సవవిగ్రహాన్ని రథంపై ప్రతిష్ఠింపచేసి ఊరేగించారు. అనంతరం వందలాది మంది భక్తులతో ఉత్సవ విగ్రహాన్ని పురవిధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. ఈ ఉత్సవాలకు తాండూరు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆర్‌బీఎల్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంపత్‌కుమార్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

రైతు సభలను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతు సభలను విజయవంతం చేయాలని బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి కోరారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా 28, 29, 30 తేదీలలో రైతులకు వ్యవసాయ పరికరాలు, ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణపై స్టాళ్లను ఏర్పాటు చేస్తామని వివరించారు.

మండల పరిషత్‌గా దుద్యాల్

- ప్రభుత్వ ఉత్వర్వులు జారీ
- ఆనందం వ్యకం చేస్తున్న మండల వాసులు



దుద్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం

దుద్యాల్: రెవెన్యూ మండలంగా ఉన్న దుద్యాల్‌ను మండల ప్రజాపరిషత్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన కొన్ని గ్రామాలను కలిపి దుద్యాల్ మండలంగా ఏర్పాటు చేశారు. దుద్యాల్ మండలానికి 21గ్రామ పంచాయతీలను కలిపి మొదట రెవెన్యూ మండలంగా ఏర్పాటు చేశారు. కొడంగల్ మండలం నుంచి హస్నాబాద్, ఆలేడ్, దౌల్తాబాద్ మండలం నుంచి కుదురుమల్ల, సంగాయపల్లి, బొంరాస్‌పేట్ మండలం నుంచి హకీంపేట్, పోలేపల్లి, దుద్యాల్, అల్లిఖాన్‌పల్లి, నాజుఖాన్‌పల్లి, చిలుముల మైల్వార్, హంసంపల్లి, గౌరారం, ఈర్లపల్లి, లగచర్ల, రోటిబండ తండా, సంట్రకుంట తండా, బొల్లిబాయి తండా, సాగారం తండా, చెట్టుపల్లి తండా, ఎక్కచెరువుతండా, సత్తర్‌కుంట తండా గ్రామ పంచాయతీలతో దుద్యాల్ మండలాన్ని ఏర్పాటు చేశారు. రెండేళ్ల అనంతరం దుద్యాల్ మండలం రెవెన్యూ మండలం నుంచి మండల ప్రజా పరిషత్‌గా ఏర్పాటు చేశారు. దుద్యాల్ మండలానికి మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ఎంపీడీవో, ఎంపీవో, ఇతర సిబ్బంది మంజూరు కానున్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే దీనికి ప్రత్యేక జెడ్పీటీసీ, ఎంపీపీ సభ్యులు పోటీ చేస్తారు. మండల ప్రజా పరిషత్‌గా దుద్యాల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో మండల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు భగవద్గీత పోటీలు

తాండూరు: తాండూరు విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు భగవద్గీత పఠనంపై కంఠస్త పోటీలు నిర్వహించారు. పాత తాండూరులోని కోటేశ్వర దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి పట్టణంలోని 20పాఠశాలలు, 3 కళాశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. భగవద్గీత 5వ అధ్యాయం కర్మసన్యాస యోగములోని 1నుంచి 29శ్లోకాలను పఠనం చేశారు. అనంతరం ఆయా విభాగాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పీ తాండూరు శాఖ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రతినిధులు సుభాన్‌రెడ్డి, గాళ్ల శివరాజ్, చల్లా నారాయణ, ఆకుల కృష్ణయ్య, గాజుల బస్వరాజ్, కే. ప్రకాశ్, సాయిరెడ్డి, చంద్రయ్య, వెంకటయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.




పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నేడు రైతు పండుగ

తాండూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించనున్న పాలమూర్ రైతు పండుగకు తాండూరు నియోజకవర్గం నుంచి 200 మంది రైతులను తరలిస్తామని వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పుర్ మండలం అమిస్తాపూర్ గ్రామ శివారులో పాలమూర్ రైతు పండుగ నిర్వహిస్తారని తెలిపారు. ఈ పండుగకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి తాండూరు ఏడీఏ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సుల్లో పెద్ద ఎత్తున రైతులను తరలిస్తామని పేర్కొన్నారు.

తాండూరు అభివృద్ధికి కృషి

యాలాల: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తాండూరు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా మనోహర్‌రెడ్డి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలతో మమేకంగా ఉంటూ, మచ్చలేని నాయకుడిగా మనోహర్‌రెడ్డి గుర్తింపు పొందారన్నారు. తాండూరు నియోజకవర్గంలో గ్రామీణ రోడ్లతో పాటు డబుల్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే చొరవ అభినందనీయమని కొనియాడారు. ప్రతిపక్షం, విపక్షం అనే తేడా లేకుండా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. రానున్న కాలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి చేరేలా ఎమ్మెల్యే చొరవ చూపాలని ఆకాంక్షించారు.



ఎమ్మెల్యేతో అక్బర్‌బాబా

మురుగు.. పరుగు!

- పెరుగుతున్న దోమల వ్యాప్తి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు



హకీంపేట్‌లో రోడ్డుపై చేరిన మురుగు నీరు



పోలేపల్లిలో పారుతున్న మురుగు

దుద్యాల్: రోడ్లపై మురుగు పారుతోంది. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. మండల పరిధిలోని హకీంపేట్, పోలేపల్లి గ్రామాల్లో ఇవి దర్శనమిస్తున్నాయి. సరైన మురుగు కాల్వల వ్యవస్థ లేకపోవడంతో ఇండ్లనుంచి వెలువడే మురుగు ప్రధాన వీధుల గుండా పారుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ దోమలు వ్యాపించి వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ విషయంలో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తా

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు

కుల్కచర్ల: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తానని, దీనికి టీఎస్‌యూటీఎఫ్ ఎల్లప్పుడు ముందంజలో ఉంటుందని జిల్లా ప్రధానకార్యదర్శి రాములు పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ మండల కేంద్రంలో యూటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన బాధితులను ప్రత్యేకంగా పర్యవేక్షించేందుకు గురుకుల మాదిరిగా ప్రత్యేకంగా ఓ ఉద్యోగిని నియమించాలని డిమాండ్ చేశారు. అధికారులు తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడి గురి చేయడం సరికాదన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో డాటా ఏంట్రీ నమోదులో ఉపాధ్యాయులు ఆపరేటర్ పక్కనే ఉంటూ సవరణలు చూసుకోవాలని సూచించడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు శేఖర్, ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు అనిల్, కోశాధికారి విఠల్, మండల నాయకులు శ్రీశైలం, ప్రవీణ్, శ్రీనివాస్, వినయ్, జహీర్, ధారసింగ్, నందు, తదితరులు పాల్గొన్నారు.



చౌడాపూర్‌లో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయిస్తున్న సంఘం నేతలు

సమగ్ర కుటుంబ సర్వే పూర్తి



తాండూరు రూరల్: సర్వే వివరాల నమోదును పరిశీలిస్తున్న విశ్వప్రసాద్

ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: తాండూరు మండలంలో సమగ్ర కుటుంబ సర్వే పూర్తయ్యిందని ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే పూర్తయిన కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో చేపడుతున్న నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో 15,244 కుటుంబాలు ఉన్నాయని, ఇందులో ఇప్పటి వరకు 14,210 కుటుంబాల సర్వే పూర్తయినట్లు చెప్పారు. మిగితా 1,034 కుటుంబాలు వలస వెళ్లారన్నారు. వలస వెళ్లిన వారి వివరాలను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా టోల్‌ఫ్రీ నంబర్ ఆధారంగా యజమాని నుంచి ఫోన్‌లో వివరాలు సేకరిస్తోందన్నారు. ప్రస్తుతం మండలంలో 18 కంప్యూటర్ల ద్వారా సర్వేను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఆనంద్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రైతులకు మహర్దశ రాబోతోంది

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు మహర్దశ రాబోతుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ సమీపంలోని మార్కెట్ ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి విజన్ ఉన్న నాయకుడని, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఆయన ముందుకు సాగుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ పాలకులు అబద్దాలతో పరిపాలన చేశారని విమర్శించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను లక్షల కోట్లు అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. వాళ్లు చేసిన అప్పులకు సీఎం రేవంత్‌రెడ్డి మిత్తిలు కడుతున్నారన్నారు. కాంగ్రెస్ పాలనపై బీఆర్‌ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, కార్యకర్తలు అధైర్యపడకుండా ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అన్ని రంగాల్లో వెనుకబడిన కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఇండస్ట్రీయల్ పార్కును ఏర్పాటు చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు.

ప్రతిఒక్కరూ శుభ్రత పాటించాలి

వైద్యాధికారి వాజుద్దీన్

కుల్కచర్ల: విద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ శుభ్రతను పాటించాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి వాజుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో పాఠశాల సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిబ్బంది అనారోగ్యంతో పాఠశాలకు వచ్చిన సందర్భాలలో విద్యార్థుల దగ్గరకు వెళ్లొద్దని, వారికి దూరంగా ఉండటానికి ప్రయత్నించాలని, అవసరం మేరకు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. వంట సిబ్బంది జ్వరం, దగ్గు, జలుబు తదితర సమస్యలు ఉన్నప్పుడు వంటకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతీరోజు వంటశాల శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, వైద్య సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల సిబ్బందికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి వాజుద్దీన్

నెహ్రూ యువజన కేంద్ర సేవలు అమోఘం



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు

ఎంపీడీఓ మహేశ్‌బాబు

దోమ: విద్యార్థులకు నెహ్రూ యువజన కేంద్రం అందిస్తున్న సేవలు అమోఘమని ఎంపీడీఓ మహేశ్ బాబు పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు ఎంపీడీఓ మహేశ్‌బాబు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి అనిల్‌కుమార్, రెండోవ శిరీష, మూడోవ వైష్ణవికి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రూపాలక్ష్మి, కళాశాల ఎస్ఓ ప్రశాంతితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థుల అభ్యున్నతికి నెహ్రూ యువజన కేంద్రం చేసే సేవలు అభినందనీయమన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



అక్కంపల్లి కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సాయిచరణ్, వేణు

ఆర్ఐలు సాయిచరణ్, వేణు

యాలాల: వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని మండల ఆర్ఐలు సాయిచరణ్, వేణు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దేవనూరు, రాస్నం, జుంటుపల్లి, అక్కంపల్లి, యాలాల, బెన్నూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం వివరాలు, బిల్లుల నమోదు, తూకాల పట్టికలు పరిశీలించారు. తేమ శాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రైతులకు బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని అక్కడి సిబ్బందిని వారు ఆదేశించారు.

తాండూరులో చెస్ చాంపియన్ షిప్

- డిసెంబర్ 15నుంచి 28 వరకు
- అండర్ 14, 16 విభాగాల్లో నిర్వహణ

తాండూరు టౌన్: హిందూ ధార్మిక పరిషత్, తాండూరు ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో చెస్ చాంపియన్ షిప్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు మాత్రమే ఈ పోటీలో పాల్గొంటారని ప్రతీ ప్రైవేటు పాఠశాలల నుంచి నలుగురిని తుది పోటీలకు పంపిస్తారని తెలిపారు. అండర్ 14, 16 విభాగాల్లో నిర్వహించనున్న ఈ పోటీలు డిసెంబర్ 28వ తేదీన తుదిపోరు ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధార్మిక పరిషత్ కన్వీనర్ గాజుల బస్వరాజ్, సభ్యులు కరణం పురుషోత్తం రావు, నరేందర్, వేణుగోపాల్ రెడ్డి, ఓం ప్రకాశ్ సోమాని, ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్ రెడ్డి, మోహన్ గౌడ్, జెసింథా, కిరణ్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- ఎంపీడీఓ రాములు
- అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది



మర్పల్లి: అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీకార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు



బంట్వారంలో అవగాహన ర్యాలీ



తాండూరు: విజ్ఞాన సదస్సులో లీగల్‌సెల్ ప్రతినిధులు

బంట్వారం: బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలని ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బంట్వారం మోడల్ స్కూల్లో 'బాల్య వివాహ ముక్త్ భారత్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆడపిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్లు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. బాల్య వివాహాలపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించాలన్నారు. మైనర్లకు పెళ్లి చేస్తే తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే ఈ వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ నాగరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్యూలా, ఏపీఎం దేవయ్య, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, పంచాయతీ కార్యదర్శి గోపాల్, అంగన్‌వాడీ టీచర్లు అనసూయ, రేణుకదేవి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బూచన్‌పల్లి పల్లే దవాఖాన వైద్యాధికారిణి డాక్టర్ దీపికా పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బూచన్‌పల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో బాల్యవివాహాలపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా ఆడపిల్లకు, 21 సంవత్సరాలు నిండకుండా పురుషులకు వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో కొంత మంది పేదరికంలో ఉన్న వారు తెలిసి తెలియకుండా తమ పిల్లకు చిన్నతనంలోనే వివాహాలు చేసి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయస్సులో పెళ్లి చేస్తే బాలికలకు రక్తహీనతతో పాటు పుట్టబోయే బిడ్డ బలహీనంగా పుడుతారన్నారు. దీంతో తల్లీబిడ్డకు క్షేమం కాదు. ఎవరైనా బాల్య వివాహాలు నిర్వహిస్తే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు అనుసూజ, వీరమణి, సరోజ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్లాపూర్‌లో..

మండల పరిధిలోని కొత్లాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి గ్రామంలో బాల్యవివాహాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1098 మండల కో ఆర్డినేటర్ యాదయ్య మాట్లాడారు. బడి బయట ఉన్న బాలికలకు బాల్య వివాహాలు చేస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు సులోచన, ఆశా వర్కర్లు, ఆయాలు విద్యార్థులు పాల్గొన్నారు.

తాండూరులో..

తాండూరు: బాల్య వివాహ చట్టాలపై విద్యార్థులు అవగహన పెంచుకోవాలని మండల్ లీగల్ సెల్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. తాండూరు పట్టణంలోని విజయవిద్యాలయంలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో లీగల్‌సెల్ కమిటీ ప్రతినిధి ప్రేమ్‌కుమార్ ప్యానెల్ న్యాయవాదులు బాల బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు జిలాని, మస్తాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శరత్కళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.